క్లుప్తంగా

జీజీహెచ్ సమస్యలపై హెల్త్ సెక్రటరీకి ఎమ్మెల్యే వినతి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సమస్యలను పరిష్కరించాలని విజయవాడలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని ఇతర ఆస్పత్రుల్లో వినియోగంలో లేని వైద్య పరికరాలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించి వైద్య సేవలను మెరుగుపర్చాలని కోరారు. ఆసుపత్రిలో రోగులకు వేగవంతమైన సేవలందించేందుకు కనీసం 50 మంది క్లాస్–4 సిబ్బందిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ వేలాది మంది రోగులకు సేవలందిస్తున్న గుంటూరు జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం



నెహ్రూనగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ పనిచేస్తు ఇటీవల మృతి చెందిన కార్మికులు నాగిపోగు నాగరాజు కుటుంబ సభ్యులు కుమారికి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చుల కింద రూ.15 వేలు డీడీని వారి కుటుంబ సభ్యులకు సోమవారం కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ అందించారు. నగర పాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్, త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు.

కులగణన చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా!

నెహ్రూనగర్: జనగణనతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని అడిగితే అరెస్టు చేస్తారా అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో శాంతియుతంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని ర్యాలీ నిర్వహించే క్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావును పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. బీసీల పార్టీగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం బీసీల డిమాండ్ల సాధనకై జరుగుతున్న మహా ర్యాలీని అడ్డుకోవడం బాధాకరమన్నారు. త్వరలో మహా ర్యాలీని నిర్వహించి తీరుతామని చెప్పారు.

అమ్మవారికి మల్లెపూలతో ప్రత్యేక పూజలు



నగరంపాలెం: స్థానిక శారదాకాలనీ ఏడో వీధిలో కొలువైన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు మొదలయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి సుప్రభాత సేవ, మల్లెపూలతో సహ్రస నామాలతో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి చింతల రమామహేశ్వరి బృందం భక్తిగీతాలు ఆలపించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్ : ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ షేక్ రెహ్మాన్ జువాలజీ సబ్జెక్టుతో పాటు సైన్స్ గురించి వివరించారు. గణితశాస్త్రంలోని పలు సూత్రాలపై సుబ్రహ్మణ్యం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ స్టేడియానికి కూటమి గ్రహణం

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- కూటమి ప్రభుత్వంలో శ్రద్ధ చూపడం లేదు
- నీటి బుడగలుగా మారుతున్న నాయకుల వాగ్దానాలు



బీఆర్ స్టేడియం ముఖద్వారం

గుంటూరు వెస్ట్(క్రీడలు): అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో నగర ప్రజలు క్రీడలకు దూరమవుతున్నారు. ఎన్నో ఆటలకు కేంద్రమైన గుంటూరు నగరం ప్రాధాన్యం కోల్పోతోంది. ఒకప్పుడు క్రీడా అసోసియేషన్లకు కేరాఫ్‌గా ఉండేది. క్షేత్రస్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు వచ్చేవారు. అందుకు బీఆర్ స్టేడియం కేంద్రంగా ఉండేది. ప్రస్తుతం పట్టించుకునే నాథుడే లేక దీనంగా రోదిస్తోంది.

స్టేడియం ఇలా..

నగరం నడిబొడ్డున బీఆర్ స్టేడియం ఉంది. సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 1964లో 26 ఎకరాల్లో(ప్రస్తుతం మిగిలింది 18 ఎకరాలే) అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి శంకుస్థాపన చేశారు. 1966లో అందుబాటులోకి వచ్చింది. మొత్తం రూ.10 లక్షలతో పూర్తి చేశారు. 1970 నుంచి 2010 వరకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా నిలిచింది. 1970 దశకంలో గవాస్కర్ సొగసైన డ్రైవ్స్, కపిల్ దేవ్ స్వింగ్ బౌలింగ్‌తో అలరించిన మైదానం. పరుగుల రాణి పి.టి.ఉష అద్భుత ప్రదర్శనకు వేదికైన ప్రదేశం. రామనాథన్ కృష్ణన్‌లాంటి దిగ్గజ టెన్నిస్ క్రీడాకారుల మాయాజాలానికి ప్రజలు ముగ్ధులైన ప్రాంతము ఇదే. అందుకే బ్రహ్మానంద రెడ్డి స్టేడియంకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గొప్ప పేరుంది.

శాప్ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి

మైదాన ఆవరణలో రూ.3 కోట్లు వెచ్చించి నిర్మించిన భవనంలో జిల్లా కార్యాలయం మాత్రమే నడుస్తుంది. ప్రధాన కార్యాలయం విజయవాడలో అద్దె భవనంలో ఉంది.

కోచ్‌లు అంతంత మాత్రమే

స్టేడియంలో టెన్నిస్, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, ఫెన్సింగ్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, జూడో లాంటి 23 క్రీడల సాధనకు అవకాశముంది. వసతులు కోచ్‌లు 12 మందే ఉన్నారు. వీరిలో చాలా మంది గత 30 ఏళ్ల నుంచి ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరికి పర్మినెంట్ కాకపోవడంతో వారిలో కొందరు కోచింగ్‌తో పాటు ఇతర పనులు కూడా చేసుకోవాల్సిన పరిస్థితి. మరో మూడు రోజుల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వసతులు లేక, క్రీడా సామగ్రి అందుబాటులో రాక ఎలా నిర్వహిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



స్టేడియం ఆవరణలో కట్టిన దుకాణాలు



స్టేడియం వెనుక మార్గం

ప్రస్తుతం ఇలా..

- స్టేడియంలో అంతర్భాగంగా ఉండే సుమారు 4 ఎకరాల భూమి రోడ్డు ఫేసింగ్‌లో ఖాళీగా ఉంది. గతంలో ఓ ప్రజాప్రతినిధి కబ్జాకు ప్రయత్నించగా పోలీసులు భారీగా మోహరించి వారిని ఖాళీ చేయించారు. ఇటీవల కొందరు వ్యాపారులు, వాహన చోదకులు ఆక్రమించారు. ముఖ్యంగా ఈ స్థలానికి కాంపౌండ్ వాల్ లేదు.
- స్టేడియంలో విద్యుత్ లైటింగ్ అంతంత మాత్రమే. పార్కింగ్ సదుపాయం లేదు. మరుగుదొడ్లు సరిగ్గా లేవు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది.
- ఈ స్టేడియంలో ఉన్న గ్యాలరీ రాష్ట్రంలో మరే స్టేడియంలోనూ లేదు. అయితే పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారింది.
- చిన్న వర్షాలకు కూడా చెరువును తలపిస్తుంది.
- జాతీయ క్రీడ హాకీకి జిల్లాలో మైదానం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ స్టేడియంలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో రెండు ఎకరాలు హాకీకి కేటాయిస్తే బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు.
- దాదాపు రూ.50 లక్షలతో నిర్మించిన స్కేటింగ్ రింక్ నిరుపయోగంగా మారింది. పగుళ్లు, లైటింగ్ సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.
- రోడ్డు వైపు నిర్మించ తలపెట్టిన దుకాణాలు ఇంకా పూర్తి చేయలేదు. ఇవి పూర్తి చేసి అద్దెలకిస్తే కొంత ఆదాయం వస్తుంది.

గొప్ప వైభవాన్ని చూశా..



ఇంత పెద్ద స్టేడియం మన ఊరిలో ఉండడం గొప్ప విషయం. కొత్తవి నిర్మించడం సంగతి దేవుడెరుగు ఉన్న వాటిని కాపాడుకోవాలి కదా. నేను ఈ స్టేడియం శంకుస్థాపన నుంచి ఉన్నా. జాతీయ పోటీలు నిర్వహించా. 1989లో పి.టి.ఉష కూడా ఇక్కడ పరుగెత్తింది. ఇంత గొప్ప స్టేడియాన్ని పట్టించుకోవాలి.

–జి.శేషయ్య, ఫౌండర్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్

శాప్ కార్యాలయం ఏర్పాటు చేయాలి



శాప్ రాష్ట్ర కార్యాలయం విజయవాడ అద్దె భవనంలో ఉంది. ఇక్కడ నిర్మించిన కార్యాలయాన్ని వాడడం లేదు. రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చిన జిల్లా మనది. మన హెడ్ క్వార్టర్‌ను బాగు చేసుకోకపోతే ఎలా. విశాలమైన భూమి ఇక్కడ ఉంది. కొంత మొత్తం నిధులు ఏర్పాటు చేస్తే ఎందరో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

–చల్లా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు

త్వరలోనే అభివృద్ధికి బాటలు



స్టేడియం అభివృద్ధికి ఇప్పటికే పలు ప్రతిపాదనలు పంపాం. డీపీఆర్‌లు కూడా సిద్ధమయ్యాయి. కేంద్ర సహాయం మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్టేడియాన్ని బాగు చేసేందుకు కృషి చేస్తున్నారు. ముందుగా కాంపౌండ్ వాల్ కట్టాలి. దీనికి ఇప్పటికే కొంత మొత్తం నిధులు మంజూరయ్యాయి. అన్ని సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకం ఉంది.

–నరసింహారెడ్డి, అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ధర్నా



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నేతలు

పట్నంబజారు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం సోమవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గతనెల 25న ఆర్టీసీ యూనియన్ నేతలు ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేశారు. దానిలో భాగంగా పలు సమస్యలు ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు పరచాలని, అక్రమ సస్పెన్షన్‌లు ఎత్తివేయాలని, రిమూవల్స్ ఆపాలని, పాత వైద్య విధానాన్ని పునఃరుద్ధరించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం, సంస్థ కొనుగోలు చేసి ఆర్టీసీతో నిర్వహించాలని,గ్యారేజీ సమస్యలు పరిష్కరించాలని, కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన ప్రమోషన్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. గుంటూరు –1 కార్యదర్శి బి.వి.శంకరరావు, గుంటూరు –2 డిపో కార్యదర్శి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో గుంటూరు–1,2 డిపోల నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి టాపర్లకు మంత్రి పెమ్మసాని అభినందన

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో అత్యధిక మార్కులతో ప్రతిభావంతులుగా నిలిచిన మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థినులను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభినందించారు. సోమవారం బృందావన్‌గార్డెన్స్‌లోని పెమ్మసాని కార్యాలయంలో టెన్త్‌లో 595 మార్కులు సాధించిన ఎం.గౌసియా, ఐ.శ్రీకారుణ్య నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు అని తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. ఇద్దరు విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడిన పెమ్మసానికి వారిలో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకరు కూరగాయలు అమ్మే వ్యక్తి అని పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్ వివరించారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులు టెన్త్ ఫలితాల్లో గుంటూరు నగర టాపర్లుగా నిలవడంపై ప్రశంసించారు. విద్యార్థినులు ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రులకు అండగా నిలవాలని సూచించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం ఇరువురు విద్యార్థినులకు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతిని పెమ్మసాని చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కన కేవీ సెబాస్టియన్, మంజు

లౌకిక రాజ్యాంగానికి తూట్లు

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో డీఆర్వోకి వినతిపత్రం

నెహ్రూ నగర్: లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఎదుర్కొవడంలో క్రైస్తవలంతా సంఘటితంగా పోరాడాలని రాజమండ్రి క్రైస్తవ నాయకులు జాన్ బెన్నీ లింగం పేర్కొన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి విషయంలో హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి ఆరో రోజుకు చేరాయి. దీక్షలో రాజమండ్రి నుంచి వచ్చిన క్రైస్తవ నాయకులు జాన్ బెన్నీ లింగం మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ముందస్తు పన్నాగంతో కూడిన హత్య అని ఆరోపించారు. భారతదేశంలో సువార్తను అడ్డుకోవాలని క్రైస్తవ సమాజాన్ని అంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్న క్రైస్తవ వ్యతిరేక శక్తులను అడ్డుకునేందుకు అందరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇది లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న రాజ్యాంగ వ్యతిరేక శక్తులను అంతం చేసేందుకు క్రైస్తవులు, ముస్లింలు ఒకే వేదిక వచ్చి పోరాడాలని అన్నారు. అనంతరం డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు, హేబెలు, జాతీయ దళిత క్రైస్తవ వాచ్ రాష్ట్ర నాయకురాలు గద్దె రతన శ్రీ, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు వద్దు ప్రేమ జ్యోతి బాబు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరాకు అంతరాయం ఉంటుందని డీ–13 సెక్షన్ డీఈఈ పీహెచ్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 వరకు సరఫరా ఉండదని చెప్పారు. విజయవాడ రోడ్ తూర్పు సైడ్, కబర్దిన గర్, ఆర్చ్ రోడ్, ఎన్‌టీఆర్ నగర్, అంబేడ్కర్ నగర్, అరుంధతి నగర్, మంగళదాస్‌నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎయిర్ కండీషనర్ వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌కు భాష్యం రామకృష్ణ సతీమణి భాష్యం పేరమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.2 లక్షల విలువ చేసే ఎయిర్ కండీషనర్‌లు సోమవారం వితరణ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ జీజీహెచ్‌కు దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు.

రూ.1.20 లక్షల మాయం

లక్ష్మీపురం: వాట్సాప్‌లో వచ్చిన ఓ లింక్‌ను నొక్కడంతో వివరాలు అడగడంతో వివరాలు తెలియజేయడంతో క్రెడిట్ కార్డులో ఉన్న రూ.1.20 లక్షలు మాయం అయిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. భవానీపురం, మిర్చియార్డు, నల్లపాడు రోడ్డు ప్రాంతానికి చెందిన కాసు శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి పంచాయతీరాజ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శ్రీనివాసరెడ్డి పేరుతో ఆర్‌బీఎల్ బ్యాంక్‌కు సంబంధించిన క్రెడిట్ కార్డు ఉంది. దానిని అవసరాల నిమిత్తం వాడుతుంటాడు. అయితే ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం సమయంలో వాట్సాఫ్ నంబర్‌కి 447577041986 నంబర్ నుంచి లింక్ వచ్చింది. ఆ లింక్‌ను గమనించిన శ్రీనివాసరెడ్డి నొక్కడంతో వివరాలు అడిగింది. లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను తెలియజేశాడు. వెంటనే క్రెడిట్ కార్డులో ఉన్న రూ.96,681.50 వేలు ఒక సారి రూ.23407.10 వేలు ఒక సారి డబ్బులు డ్రా చేసినట్లు ఆన్‌లైన్ ద్వారా మెసేజ్ వచ్చింది. దీంతో శ్రీనివాసరెడ్డి సైబర్ క్రైమ్ నంబర్ 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఉరుసు వేడుకలు



పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 16వ ఉరుసు గంధ మహోత్సవములో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఊరేగింపుగా బయలుదేరిన గంధం సోమవారం ఉదయం 11 గంటలకు కరిముల్లా షా ఖాదరి బాబా వారి నిషానికు చేరుకుంది. బాబా వారి సలామి ప్రార్థనలు, ఖురాన్ పఠనం అనంతరం నిర్వాహకులు భక్తులకు గంధం పంపిణీ చేశారు. భక్తులు దర్గా ప్రాంగణంలో దీపారాధనలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. దర్గాకు విచ్చేసిన భక్తులందరికీ అన్నసంతర్పణ నిర్వహించారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు సంబంధించి విధులు కేటాయించబడిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా విధులు కేటాయించబడిన అధికారులకు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా సభా ప్రాంగణంలో ప్రధాన వేదిక, వీవీఐపీ వేదిక, కల్చరల్ వేదికలుగా 3 వేదికలు ఏర్పాటు చేస్తున్నారని, వాటి వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. 6 పార్కింగ్ ఏరియాలను ఏర్పాటు చేస్తునారని వాటి వద్ద మౌలిక సదుపాయాలు, శానిటేషన్ నిర్వహించడం, గ్యాలరీలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు అధికారులకు సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించినట్లు చెప్పారు. విధులు కేటాయించబడిన అధికారులు సిబ్బంది తప్పనిసరిగా నిర్దేశిత గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. పారిశుధ్య పనులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా యాప్రాన్, మాస్క్, గ్లౌజులు, డస్ట్ బిన్ కలిగి ఉండి సభా ప్రాంగణం వద్ద వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. ముఖ్యంగా ఫుడ్ కోర్ట్, మెడికల్ క్యాంపు, హెల్ప్ డెస్క్ వద్ద పారిశుధ్యం, పక్కాగా ఉండాలని, సదరు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న మొబైల్ టాయిలెట్స్‌కు నీటి సరఫరా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది మే 1వ తేదీ ఉదయం నుంచి పూర్తి స్థాయిలో కేటాయించిన ప్రాంతాల్లో ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్‌ఓ రవిబాబు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సివిల్ సర్జన్ వెంకటేశ్వర రావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్రైవేటుకు ధీటుగా కోర్సులు

ప్రొఫెసర్లు తులసీదాసు, బ్రహ్మాజీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రైవేటు విశ్వ విద్యాలయాలకు ధీటుగా వైవిధ్యమైన కోర్సులు అందిస్తోందని వర్సిటీ ప్రొఫెసర్ తులసీదాసు అన్నారు. సోమవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు ఏఎన్‌యూ అందిస్తున్న పీజీ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీ మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచి, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యా ప్రమాణాలను పాటించడంలో ప్రైవేటు వర్సిటీలకు ఆదర్శంగా నిలిస్తోందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు విశిష్టమైన సేవలను అందిస్తూ అన్నింటా అగ్రగామిగా నిలుస్తోందని అన్నారు. విద్య, ఉపాధి అవకాశాల్లో ఏఎన్‌యూ సముచిత స్థానంలో ఉందని, అధ్యాపక బృందం విలువలతో కూడిన విద్య, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని వివరించారు. వర్సిటీ అందిస్తున్న కోర్సులు, విద్యా అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని కోర్సుల ఫీజులు ఉన్నాయని, సమాజ అవసరాలకు తగినట్లుగా వర్సిటీలో పలు వినూత్న కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు పలు డిప్లొమో. సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోందని వివరించారు. విద్యార్థులకు మంచి సదుపాయాలు, ఆరోగ్యకర రీతిలో కూడిన వసతి గృహాలు, వ్యాయామ శాలలు, పుస్తక పఠన శాలలు ఆహ్లాదకర రీతిలో ఉన్నాయని చెప్పారు. డిగ్రీ అనంతరం విద్యార్థినులు వర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్, ఏబీవీ నేతలు

ఏఎన్‌యూ: సేవ్‌బర్డ్... సేవ్ ఎన్విరాన్‌మెంట్ అనే నినాదంతో స్టూడెంట్స్ ఫర్ డెవలప్మెంట్, ఏబీవీ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విశ్వవిద్యాలయంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పక్షులు వేసవి కాలంలో నీరు, ఆహారం కోసం పక్షులు ఇబ్బంది పడకుండా తమ జీవనాన్ని సాగించే వీలు ఉంటుందన్నారు. విద్యార్థులతో కలిసి పక్షి మిత్ర అభియాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజానికి, పర్యావరణానికి హాని కలిగించే ఒక్క సారి వినియోగించే ప్లాస్టిక్ బాటిల్స్‌ను సేకరించి వాటిని నీటి పరికరాలుగా తయారు చేసి వాటిలో నీరు, ఆహారం ఏర్పాటు చేసి, విశ్వవిద్యాలయంలోని చెట్లకు వాటిని అమర్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ శివ, రాష్ట్ర ఎస్‌హెచ్‌ఓ డీహెచ్ కన్వీనర్ రమాకాంత్, యూనివర్సిటీ అధ్యక్షులు చంద్రిక, యూనివర్సిటీ సెక్రటరీ వంశీ, యూనివర్సిటీ ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ రాహుల్, యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి



మాట్లాడుతున్న మాల్యాద్రి

లక్ష్మీపురం: రిటైర్డ్ అయిన కార్మికులందరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం నగర పాలక సంస్థలో పనిచేస్తూ 60 సంవత్సరాలు నిండిన కారణంగా విధుల నుంచి తొలగించబడ్డ ఆప్కాస్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, అలాగే నగరపాలక సంస్థ నుంచి పీఎఫ్ తదితరులను వారికి అందే వరకు కావాల్సిన సహకారం యూనియన్ నుంచి ఎప్పుడు ఉంటుందని అన్నారు. పదవి విరమణ వయసు 62 నుంచి 60కు తగ్గించడం దుర్మార్గమని చెప్పారు. ఒక పక్క పర్మినెంట్ కార్మికులను 62 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉండగా మరొక వైపు ఆప్కాస్ వర్కర్లను 60 సంవత్సరాలకు కుదించడం వలన వాళ్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటి వీరాంజనేయులు, శివయ్య, సూరిబాబు దేవదానం జాన్ నిర్మల దేవమ్మ పద్మ పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి బోనాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో కొలువుదీరిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివారి 27వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ ఆదిశక్తి అంకమ్మతల్లికి బోనాలు సమర్పించారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి కంకుమ, మల్లెపూలతో సహస్రనామావళి చేపట్టారు. సాయంత్రం వేదమంత్రోచ్చారణ నడుమ బలిహరణ శాస్త్రోక్తముగా నిర్వహించారు. రాత్రి శ్రీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం భక్తజనుల సమక్షంలో కనుల పండువుగా సాగింది. వేద పండితులు దండిబొట్ల కృష్ణశర్మ, మాధవశర్మల నేతృత్వంలో పూజలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. గ్రామస్తులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

